


# భేదం

**కె.వి.ఎస్.వర్మ**

**ప్రస్తుత కథాగ్రేసరుడు మొదట కవితలు రాసేవాడు కదా. అతని మిత్ర బృందంలోని గోపాలం కూడా వాటిని పొగిడేవాడు. పొగడ్తలు బాగా అలవాటయిపోయాయి. కథల్ని కూడా అలా మెచ్చుకుంటారని ఆశించాడు. గోపాలం వాటిని కథలే గావన్నాడు. పైగా తన మిత్రుడు గోపాలం చెబుతుంటే ఆ మాటకు విలువ పెరుగుతోంది. దాంతో గోపాలాన్ని శత్రువును చేసుకోడానికి కథాగ్రేసరుడు ఆ మందు పార్టీని అలా వుపయోగించుకున్నాడన్న మాట.**

"గోదారీ గట్టుంది, గట్టు మీన చెట్టుంది, చెట్టు కొమ్మన పిట్టుంది, పిట్ట మనసులో ఏముందో..." కొటేషన్‌రావు పాడుతున్నాడు.

మిత్రులు వింటున్నారు.

గోదావరి పక్క రోడ్డు మీద అప్పుడో లారీ, అప్పుడో స్కూటరూ వెళ్తున్నాయి. గోదావరి ఒడ్డుకి లాంచీ వచ్చింది. ఆ లాంచీ కొవ్వూరు నుంచి రాజమండ్రికీ, రాజమండ్రి నుంచి కొవ్వూరికీ తిరుగుతోంది. రోడ్డు కమ్ రైలు బ్రిడ్జి మీది రోడ్డు రిపేరు చేస్తుండడంతో దాని మీద వాహనాల రాకపోకల్ని ఈ మధ్యే బంద్ చేశారు.

కొటేషన్‌రావు పాట అయింది.

" నిజమేనోయ్. మనిషి మనసులో ఏముందో తెలీదు ఒక పట్టాన. ఇంక పిట్ట మనసులో ఏముందో ఎలా తెలుస్తుంది"

" పిట్ట మనసులో ఏముందో మానవ మాత్రుడికి తెలీక పోవచ్చు. మనిషి మనసులో ఏముందో ఆ క్షణంలో తెలియక పోయినా నిలకడ మీద తెలియకపోదు"

"ఎలా ?" అన్నాడు నాయుడు.

"సరిగ్గా ఆర్నెల్ల క్రితం నేను నా బర్త్‌డే పార్టీ ఇచ్చాను. అప్పుడు అమలాపురంలో వుండేవాణ్ని కదా. ఓ లాడ్జిలో డబుల్ రూమ్ అద్దెకు తీసుకున్నాను. రెండు ఫుల్ బాటిల్స్ పురాతన బౌద్ధ బిక్షువు (ఓల్డ్ మంక్) తెప్పించాను. మంచింగ్‌కు పకోడీలూ, మిక్సరు వగైరా తెప్పించాను. ఆరేడుగురు మిత్రులు వచ్చారు. గ్లాసులెత్తి 'ఛీర్స్' చెప్పుకున్నాం. "ఎప్పుడూ ఇలాగే గ్లాసుల గలగలలతో నీ బతుకెప్పుడూ కళకళలాడాలని కవి కుమారుడు కమ్ కథాగ్రేసరుడు నాకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పాడు.

అలా మొదలైన పార్టీ రెండో రౌండ్ వరకూ కబుర్లతో, జోకులతో చాలా సరదాగా సాగింది. మూడో రౌండ్ కొచ్చాం. నాన్‌వెజ్ తెమ్మన్నాను బోయ్‌తో.

అంతలో,

"ఏంటోయ్ గోపాలం 1975 జులై 17 వ తేదీన నువ్వలా చేశావ్" అన్నాడు కథాగ్రేసరుడు గొంతు పెంచి.

"నువ్వేం అంటున్నావో నాకు అర్థం కావడం లేదు"

"మిత్రద్రోహికి ఎందుకర్థం అవుతాయిలే"

గోపాలం తనను కాదన్నట్టు గ్లాసునోటి దగ్గర పెట్టుకున్నాడు.

"నిన్నేరా తపేలం. ఆ రోజున ఇంగ్లీషు సినిమా కెళ్దామనుకున్నామా. థియేటర్ దగ్గర కలుసుకుందామనుకున్నామా. నేనేమో రెండు టిక్కెట్లు కొని నీకోసం ఎదురు చూస్తూ థియేటర్ దగ్గర నిలుచున్నాను. సినిమా బిగినయి పోయింది. నువ్వు రాలేదు. నీ టిక్కెట్టూ వేస్టయింది. నువ్వు వేస్ట్ బకెట్‌వి" అన్నాడు కథాగ్రేసరుడు.

గోపాలం గుర్రుగా చూశాడు.

"నెల క్రితం నువ్వేదో వాగేవట. మావోడు బనియన్ వేసుకోడండి అన్నావట. నేను బనియన్ వేసుకుంటే నీకేంటి? నేను కట్ డ్రాయర్ వేసుకోకపోతే నీకేంటి?" అన్నాడు కథాగ్రేసరుడు తన గ్లాసు చేతిలోకి తీసుకుంటూ.

"ఇదెక్కడి గొడవరా బాబూ" అనుకుంటూ నేనూ నా గ్లాసు చేతిలోకి తీసుకున్నాను.

"ఇంకేంటి బాస్" అన్నాడు గోపాలం సిప్ చేస్తూ.

"దుర్మార్గ దుశ్శాసనా! ఇంకేంటని అడుగుతున్నావా ? చెబుతాన్రా, చెబుతా నొరేయ్. నేను తాగుతానని దుష్ప్రచారం చేస్తున్నావట!"

" ఏంటిసార్, తమరు తాగరాండీ?"

"ఏంటండీ , వెటకారాలాడుతున్నారు"

"వెటకారమా, గాడిద గుడ్డా? నువ్వు తాగవా అని డైరెక్టుగా అడుగుతున్నా"

"తాగితే...?! నువ్వు అందరికీ టాంటాం వేస్తావా? నీకేటధికారం?"

"అయ్యా, నాకేమియూ అధికారం లేదు. అయితే, ఒక్క విషయం. మన కథాగ్రేసరులనీ పార్టీకి పిలుద్దాం అని మన సాహితీపరులు అడుగుతారు కదా. అలాంటప్పుడు మీ నామధేయం చెప్పితిని. హౌరా? ఆయన మధుపానం చేయరు కదా అని ఒకరు అడిగారు. నేను పగలబడి నవ్వి నవ్వి 'ఆరూ కథాగ్రేసరులు బాహాటముగా తాగరు. లోపాయకరముగా తెగ తాగెదరు. ఆయన ఇటువంటి నైతిక విషయములలో గజదొంగ' అని నేను చెప్పియున్నాను. ఇది తప్పందురా ?" అని గోపాలం మాఅందరి వంక చూశాడు.

మేమంతా ముక్కు మీద వేలేసుకుని తల అడ్డంగా తిప్పుతూ తప్పుకాదని 'ముక్కు' వక్కాణించాం.

కథాగ్రేసరుడు మా అందరి వంక వీరాగ్రహంతో చూసి, తన గ్లాసులోని మందంతా ఒక్క గుటకలో తాగేశాడు.

మేం అంతా మందులోనూ హాశ్చర్యపోయాం.

ఇంతలో రూమ్ బోయ్ చికెన్ ఫ్రై తెచ్చాడు. మేమంతా దాని మీద దాడి చేశాం.

ఓ ముక్క నోట్లో వేసుకుని నములుతూ,

"తపేలంగారూ, నా కథలను సమీక్షించే స్థాయికి ఎదిగి పోయేరట ఈ మధ్య" అన్నాడు కథాగ్రేసరుడు భీకరంగా నవ్వుతూ.

గోపాలం ఓ సారి కథాగ్రేసరుణ్ని చూసి, "ఒరి త్రాష్టుడా" అనుకున్నాడో ఏంటో, చికెన్ ఫ్రైయ్ ముక్క చేత్తో తీసుకుని నోట్లో పెట్టుకున్నాడు.

గోపాలం మౌనం కథాగ్రేససరునికి చాలా కోపం తెప్పించేసింది.

" ఏంటి బాబూ ? తేరగా వచ్చిందని బొక్కడం కాదు. దాన్ని తెప్పించినోడి మాటకూడా కాస్త వినాలి" అన్నాడు.

"పురుషులందు పాప పురుషులు వేరయా, విశ్వదాభి రామ వినురవేమా" అన్నాడు గోపాలం.

" అంటే, నేను పాపినా, పుండాకోర్. జాగర్త. మక్కెలిరిసేగలను" అన్నాడు కథాగ్రేసరుడు మీదిమీదికే లేస్తూ.

" నేనేం గాజులేసుకోలేదు. నోర్మూసుకో" అని గోపాలం గ్లాసు తీసుకుని సిప్ చేయబోయాడు.

కథాగ్రేసరుని చెయ్యి వేగంగా కదిలింది. గోపాలం చేతిలోని గ్లాసు కింద పడి భళ్లున పగిలింది.

గోపాలం సర్రున లేచాడు.

ఇద్దరూ చొక్కాలు పట్టుకున్నారు. వాళ్లని విడిపించేటప్పటికి మందు కిక్కంతా దిగిపోయింది.

అలా ఆ రాత్రి ఎవరిళ్లకు వాళ్లం వెళ్లిపోయాం.

కొన్నాళ్లకు గోపాలం చెబితే తెలిసింది. ప్రస్తుత కథాగ్రేసరుడు మొదట కవితలు రాసేవాడు కదా. అతని మిత్ర బృందంలోని గోపాలం కూడా వాటిని పొగిడేవాడు. పొగడ్తలు బాగా అలవాటయిపోయాయి. కథల్ని కూడా అలా మెచ్చుకుంటారని ఆశించాడు. గోపాలం వాటిని కథలే గావన్నాడు. పైగా తన మిత్రుడు గోపాలం చెబుతుంటే ఆ మాటకు విలువ పెరుగుతోంది. దాంతో గోపాలాన్ని శత్రువును చేసుకోడానికి కథాగ్రేసరుడు ఆ మందు పార్టీని అలా వుపయోగించుకున్నాడన్న మాట.

"అంటే కథాగ్రేసరుడు, గోపాలం ఫ్రెండ్స్‌గా లేరా"

" ఆ తర్వాతనుంచి వాళ్లు మాట్లాడుకోడం మానేశారు. బద్ధ శత్రువులైపోయారు" అని చెప్పాడు శాస్త్రి.

" అప్పుడే తొమ్మిది దాటింది. గౌతమి లేటులా వుంది" అంటూ లేచాడు నాయుడు.

అతనితో పాటు అంతా లేచి రోడ్డెక్కారు.

కొటేషన్‌రావు గట్టిగా అన్నాడు.

"మందు మత్తుకే కాదు, జిత్తులకు కూడా మందే"

**(వచ్చేవారం: మార్పు)** ●

**అన్ని కోరికలు తీర్చే తాంత్రిక ఉంగరము**

ఈ మాజిక్ ఉంగరం ఎవరు ధరించినా లేదా దగ్గర ఉంచుకున్నా, కోరుకునే స్త్రీ/పురుషులు మీరు పిలిచిన వెంటనే మీ పాదాక్రాంతులవుతారు. ఈ ఉంగరం ద్వారా వ్యాపారము, కోర్టు తగాదాలు, పరీక్షలలో ఉత్తీర్ణత, కోరుకున్న వివాహము, గృహ తగాదాల నుంచి విముక్తి, అప్పుల బాధలు మొదలైన మీ బాధలన్నీ తీర్చి సంతోషం కలుగజేస్తుంది. తాంత్రిక ఉంగరం: రూ.31/- స్పెషల్ తాంత్రిక ఉంగరం రూ. 101/-. శక్తివంతమైన ఉంగరం రూ.251/- సూపర్ పవర్‌ఫుల్ ఉంగరం రూ. 475/-, పన్నెండు గంటలల్లో ప్రభావం చూపే అష్ట ధాతు ఉంగరం రూ. 921/-.

పై చెప్పిన విషయాలు అబద్ధమని రుజువు చేసినచో రూ. 1001/- బహుమతిగా ఇవ్వబడును.

SANTOSH ASHRAM (K/10)
Maira Barith (Gaya)